క్లుప్తంగా

పన్ను వసూళ్లకు వేలంపాట

చీరాల టౌన్: మండలంలోని ఈపురుపాలెం పంచాయతీలోని కూరగాయల మార్కెట్, చేపలు, మాంసం అమ్మకాలు చేసే మార్కెట్‌ల పన్ను వసూళ్లకు వేలం పాటను శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి బి.మురళీ బాపూజీ ఆధ్వర్యంలో జరిగింది. 2025–26 సంవత్సరానికి కూరగాయల మార్కెట్‌లో పన్నుల వసూళ్లకు రూ.2.58 లక్షలకు, చేపలు, మాంసం దుకాణాల పన్నుల వసూళ్లకు రూ. 2.06 లక్షలకు వేలం పాట దక్కించుకున్నారని తెలిపారు. అధికంగా వసూలు చేస్తే చర్యలు తప్పవని సెక్రటరీ హెచ్చరించారు. గత సంవత్సరం కంటే ఈ ఏడాది కూరగాయల మార్కెట్, చేపలు, మాంసం దుకాణాల పన్నుల వసూళ్ల రూ.1.98 లక్షలు అదనపు ఆదాయం పంచాయతీకి పెరిగిందని కార్యదర్శి తెలిపారు.

శింగరకొండ దర్శిని


ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం ఫాల్గుణ మాసం ఉత్తరాభాద్ర నక్షత్రం అమావాస్య తిథి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు శుక్రవారం తెలిపారు. క్షేత్ర ప్రాధాన్యం ఉన్న శనివారం ఆంజనేయ స్వామికి ఇష్టమైన ఆకు పూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు శ్రీసుర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు.

నక్కబొక్కలపాడులో పట్టపగలే చోరీ

బల్లికురవ: తాళం వేసిన ఇంటి తలుపులు తెరచి పట్టపగలే దొంగతనానికి పాల్పడ్డారు. ఈ ఘటన శుక్రవారం మండల కేంద్రానికి కూత వేటు దూరంలోని నక్కబొక్కలపాడు గ్రామంలోని రైస్‌మిల్లు సమీపంలో జరిగింది. గ్రామానికి చెందిన ఆలకుంట లక్ష్మీ తిరుపతమ్మ శుక్రవారం ఉదయం ఇంటికి తాళం వేసి మండలంలోని గొర్రెపాడు గ్రామానికి వెళ్లింది. సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా ఇంటి తలుపులు, బీరువా తలుపులు తెరచి ఉండటంతో పాటు బీరువాలో ఉండవలసిన రూ. 50 వేలు నగదు, సుమారు 12 గ్రాముల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దొంగతనం జరిగినట్లుగా నిర్ధారించుకుని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. మిట్ట మధ్యాహ్నం ఎండవేడికి ప్రజలు బయటకు రాకపోవటం వలన దొంగలపని సులువుగా ముగిసిందని స్థానికులు భావిస్తున్నారు. పట్టపగలే గ్రామ కూడలిలోనే దొంగతనం జరగటం పట్ల భయాందోళన చెందుతున్నారు. పోలీస్‌శాఖ గ్రామాల వారీగా గస్తీని పెంచి దొంగతనాలకు చెక్ పెట్టాలని వేడుకుంటున్నారు.

ఫ్లోరోసిస్‌పై అవగాహన కలిగి ఉండాలి

సంతనూతలపాడు: సంతనూతలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రుద్రవరం గ్రామంలో గల మండల ప్రాథమిక పాఠశాలను శుక్రవారం జిల్లా ఫ్లోరోసిస్ నోడల్ అధికారి డాక్టర్ వి.అనిల్ కుమార్ బృందం ఆకస్మికంగా తనిఖీ చేసింది. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అధ్యక్షతన పాఠశాల పిల్లలకు ఫ్లోరోసిస్‌కు సంబంధించిన వైద్య పరీక్షలు క్రాస్ చెక్ చేసి, ఆరోగ్య సంబంధ పరీక్షలు నిర్వహించి విద్యార్థులకు సలహాలు, సూచనలు చేసింది. అలాగే, ఫ్లోరోసిస్ సర్వేకు అనుబంధంగా కమ్యూనిటీ సర్వేలో భాగంగా గృహాలను సందర్శించి వారి వివరాలు సేకరించి ఫ్లోరోసిస్, ఎన్సీడీసీడీకి సంబంధించిన పరీక్షలు, స్క్రీనింగ్ నిర్వహించారా.. లేదా..? అని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య విద్య ద్వారా 100 శాతం క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని, దానికి సంబంధించిన వివరాలు తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జె.నాగరాజు, సీహెచ్‌ఓ ఆర్.ప్రసాద్, కృష్ణ, పి.ఆదిత్య, ఏఎన్‌ఎం సునీత, ఆశా వర్కర్లు, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

సాగర్ కాలువలో పడి వృద్ధురాలు మృతి

జె.పంగులూరు: నాగార్జున సాగర్ కాలువలో పడి వృద్ధురాలు మృతి చెందిన సంఘటన శుక్రవారం జరిగింది. పమిడిపాడు మేజర్ కాలువలో పడగా.. ముప్పవరం గ్రామ సమీపంలో లాకుల వద్దకు రాత్రికి చేరుకుంది. అక్కడ మృతదేహాన్ని బయటకు తీసి ఒంగోలు తరలించారు. మార్టూరు మండలం కోనంకి గ్రామానికి చెందిన బిట్రా అన్నపూర్ణమ్మ (55) వలపర్లలోని ఆమె బంధువుల ఇంటి వద్దకు వెళ్లింది. కొంత సమయానికి తిరుగు ప్రయాణం అయింది. అయితే ఆమె కాలువ దగ్గరకు ఎందుకు వెళ్లింది, కాలుజారి పడిందా లేక కాలువలో పడాలని పడిందా అనేది తెలియరాలేదు.


కల్లాల్లో మిరపకాయలను పోగు చేస్తున్న రైతులు


తెగుళ్లతో ఎండిపోయిన మిర్చి పంట కోస్తున్న కూలీలు

మిరప రైతు కన్నీరు

- మిర్చి పంటలో తగ్గిన దిగుబడులు
- పెరిగిన పెట్టుబడులు, కూలి ఖర్చులు
- అందని గిట్టుబాటు ధర
- నష్టాల్లో రైతన్నలు


మిర్చి పంటను కోస్తున్న కూలీలు

జె.పంగులూరు: ప్రస్తుతం మిర్చి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఎకరాకు లక్షలాది రూపాయలకు పైగా పెట్టుబడి పెట్టినా పరిస్థితి శూన్యంగా మారింది. జెమినీ వైరస్, అధిక వర్షాలు తట్టుకొని పంట కాపాడుకున్నా గిట్టుబాటు ధర లేక రైతులు విలవిల్లాడుతున్నారు. మండలంలోని సుమారు 3 వేల ఎకరాలో సాగు చేయగా ప్రస్తుతం ఎకరాకు 10 క్వింటాళ్లు రావడమే గగనంగా మారింది. ఎండు మిర్చి క్వింటా రూ. 8000 వేలు నుంచి రూ. 12000 మాత్రమే పలుకుతోంది. దీనిని బట్టి రైతుకు ఎకరాకు అందేది రూ. 40 వేల నుంచి రూ. 60 వేల వరకే. అంటే సాగు ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం మిర్చి పంటను అతి తక్కువ మేర సాగు చేశారు. వారిలో 70 శాతం మంది కౌలు రైతులే ఉన్నారు.

దండెత్తిన వైరస్‌లు

ఈ సంవత్సరం గత మూడు సంవత్సరాలు కంటే మిర్చిలో వైరస్ తెగులు ఎక్కువ అయింది. ఈ తెగుళ్లతో రైతులు క్రిమి సంహారక మందులు ఎక్కువగా వాడారు. పురుగు మందుల వ్యాపారులు లాభాలు చవిచూశారు. కానీ రైతులు మాత్రం లాభాలు అందుకోలేకపోయారు. పురుగు మందు వ్యాపారుల మాటలు విని రైతులు విపరీతంగా మందులు వాడినా తెగుళ్ల మాత్రం తగ్గక పోగా ఎక్కువయ్యాయి.

అమాంతం పెరిగిన సాగు ఖర్చు

ప్రస్తుతం ఎకరాకు రూ. 1.50 లక్షలు ఖర్చు పెట్టి మిర్చి పంటను పండించారు. మిరప కోసే కూలి విపరీతంగా పెరిగింది. ఒక రోజుకు ఒక మనిషికి రూ. 350 నుంచి రూ. 400 అవుతున్నాయి. ఒక ఎకరా మిరపకాయలు కోయడానికి కూలీలు కనీసం ఒక 50 మంది పడతారు. అంటే వీరి ఖర్చు ఎకరాకు రూ. 18 వేలు నుంచి రూ. 20 వేలు వరకు అవుతోంది. కానీ కాయలు కోసి కల్లాల్లో పోసి పంటను అమ్మబోయే సరికి దళారులు వాలిపోతూ ధర రాకుండా చేస్తున్నారు. ఇప్పటికైనా మిర్చి రైతుల పరిస్థితి గమనించి మిర్చి పంటకు రైతు గిట్టు బాటు ధర తీసుకొచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అప్పుల ఊబిలో కూరుకు పోతున్నా..
రెండు సంవత్సరాలుగా నేను రెండు ఎకరాలు మిర్చి పంటకు కౌలుకు తీసుకొని పండిస్తున్నా. కానీ ఒక్క సంవత్సరం కూడా నేను పెట్టి పెట్టుబడి రాక పోగా అప్పుల ఊబిలో కూరుకు పోతున్నాను.
– రామయ్య(బూదవాడ)

4 లక్షల పెట్టుబడి
నేను మూడు ఎకరాలు కౌలుకి తీసుకొని మిర్చి పంట వేశాను. ప్రస్తుతం ఎకరాలకు రూ. 1.50 లక్షలు ఖర్చు పెట్టా. ఒక పక్క అధిక వర్షం, మరో పక్కా తెగుళ్ళ ధాటికి పంట పూర్తిగా దెబ్బతింది. ప్రస్తుతం మూడు ఎకరాల మీద రూ. 4 లక్షలు వరకు పెట్టుబడి పెట్టాను. ప్రభుత్వమే ఆదుకోవాలి.
– సాల్మాన్ (పంగులూరు)

పంట పండించటమే మహా తప్పు
నేను రెండు ఎకరాలు మిర్చి వేశా. పంట వేయక ముందు చక్కగా ఎదో ఒక పనికి పోయి.. వచ్చిన కొద్ది పాటి డబ్బులతో సంతోషంగా జీవించేవాళ్లం. నా దృష్టిలో పంటపండించటమే మహా తప్పు.. పాపం. ఒకప్పుడు ఒక్క రూపాయి అప్పులేదు. ప్రస్తుతం రూ. 2.50 లక్షలు అప్పు పడ్డా.
– రమేష్


కల్లాల్లో ఉన్న మిర్చి పంట

రేషన్ కార్డులకు ఈకేవైసీ తప్పనిసరి


కుంకలమర్రులో ఈకేవైసీ పరిశీలిస్తున్న తహసీల్దార్ నాగరాజు

కారంచేడు: తెల్ల రేషన్ కార్డులున్న ప్రతి ఒక్కరూ తప్పకుండా ప్రభుత్వ నిబంధనల మేరకు ఈకేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ జి. నాగరాజు అన్నారు. శుక్రవారం కుంకలమర్రులో జరుగుతున్న ఈకేవైసీ కార్యక్రమాన్ని పరిశీలించారు. రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబ సభ్యులు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ప్రభుత్వం ఈ నెలాఖరు వరకు మాత్రమే గడువును ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ, సచివాలయ సిబ్బందితో పాటు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కేవైసీతోనే సబ్సిడీ

అద్దంకి: గ్యాస్ వినియోగదారులకు రాయితీ అందాలంటే బ్యాంకు ఖాతాలకు కేవైసీ చేయించుకోవడం తప్పనిసరి అని కమిషనర్ రవీంద్ర అన్నారు. తమకు గ్యాస్ రాయతీ ఖాతాలకు జమ కావడం లేదని మంత్రి గొట్టిపాటికి విన్నవించుకున్న నేపథ్యంలో కమిషనర్ శుక్రవారం గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. తమ పరిధిలోని సచివాలయంలో బ్యాంక్ ఖాతాలకు కేవైసీ అయిందో లేదో తెలుసుకుని గ్యాస్ ఆఫీసులో అందజేయాలని కోరారు.

తెలుగు విశేష పండగ ఉగాది


చినగంజాంలో..


మాట్లాడుతున్న కోట వెంకటేశ్వర రెడ్డి

చినగంజాం: తెలుగు వారికి ఉగాది పర్వదినం విశేషమైనదని తెలుగు సాహితీ వేత్త కుక్కల శ్రీరామచంద్రమూర్తి రెడ్డి అన్నారు. శాంతి నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం తెలుగు భాషా వైభవం గురించి విద్యార్థులకు వివరించారు. తెలుగు వారికి ఉగాది పండుగ విశేషమైనదని తెలియపరుస్తూ పండుగ ప్రత్యేకత గురించి విద్యార్థులకు తెలియజేశారు. తెలుగు బాషాభివృద్ధి గురించి విద్యార్థి దశ నుంచే ఆసక్తి పెంపొందించుకోవాలని.. మన అమ్మ భాషను ఉన్నత స్థితిలో నిలబెట్టడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పాఠశాల సిబ్బంది సీహెచ్ వెంకటేశ్వర్లు, వీవీఎస్ కిరణ్మయి.. శ్రీరామచంద్రమూర్తిరెడ్డిని సన్మానించారు.

చీరాల రూరల్: తరతరాల మానవజాతి చరిత్రలో పండగలు, ఉత్సవాలు మన సంస్కృతిలో ముఖ్య భాగమయ్యాయని ఊరూరా జన విజ్ఞానం రాష్ట్ర అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరెడ్డి అన్నారు. ఊరూరా జనవిజ్ఞానం, ప్రజా సంఘాల ఐక్యవేదిక, సీనియర్స్ సిటిజన్స్ అసోసియేషన్, ఘంటసాల చైతన్య వేదిక సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని ఘంటసాల విగ్రహం వద్ద కోట వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సంస్కృతి. సంప్రదాయాలను కాపాడుకుంటూ వాటిలోని మంచి విషయాలను గ్రహించి ప్రతి ఒక్కరూ సమాజ హితానికి పాటుపడాలని ఆయన పిలుపునిచ్చారు. తెలుగువారి సంవత్సరాది ఉగాది పండుగ అంటే ప్రతిఒక్కరికీ ఎంతో ప్రీతిపాత్రమైనదని చెప్పారు. ఉగాది పచ్చడి మనిషి జీవితంలోని అన్ని కోణాలకు మొత్తం మానవ సమాజంలోని అన్ని రకాల అనుభవాలకు ప్రతిరూపంగా నిలుస్తుందన్నారు. పచ్చడిలోని చేదు, తీపి, కారం, వగరు, పులుపు కలిపి ఏవిధంగా కలిసి ఉంటాయో.. మానవ జీవితంలో కూడా అన్నీ కలగలిపి ఉంటాయని చెప్పారు. బక్క జయరామిరెడ్డి, గోలి జోజిబాబు, వెంకయ్య, ఎస్‌కే సుభాని, ఊసా కృష్ణ, లక్ష్మిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలి


డీఈ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

చీరాల అర్బన్: ట్రూ అప్, సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం చీరాల డీఈ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం చీరాల ప్రాంతీయ కార్యదర్శి ఎస్.బాబూరావు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని, సెకీ ఒప్పందాలు రద్దు చేయాలన్నారు. టైం ఆఫ్ డే విధానం రద్దు చేయాలన్నారు. ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై అదనపు భారాన్ని మోపడం దారుణమని.. ఈ ఒప్పందాలను రద్దు చేయకుంటే ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎస్.బాబూరావు, ఎం.సత్యమూర్తి, ఐవీ ప్రసాద్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు

చీరాల: తోటవారిపాలెం పంచాయతీలోని భావనా రుషిపేటకు చెందిన మెలిక నాగలక్ష్మి అనే యువతి ఇంట్లో మనస్పర్థల కారణంగా శుక్రవారం ఇంటి నుంచి వెళ్లిపోయిందని కుటుంబ సభ్యులు ఈపూరుపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పరిసర ప్రాంతాల్లో గాలించినా కనిపించకపోవడంతో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వక్ఫ్‌బోర్డు బిల్లును వ్యతిరేకించాలి

చీరాల: పార్లమెంట్‌లో వక్ఫ్‌బోర్డు బిల్లును తెలుగుదేశం పార్టీ వ్యతిరేకించాలని మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు షేక్ కబీర్ ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యను కోరారు. మున్సిపల్ కౌన్సిల్ హాలులో ఎమ్మెల్యేను కలిసిన ఆయన వక్ఫ్‌బోర్డు బిల్లు వలను ముస్లిం మైనార్టీలకు జరిగే నష్టాన్ని వివరించారు. ఈ బిల్లును వ్యతిరేకించాలని కోరగా స్పందించిన ఎమ్మెల్యే ఈ విషయాన్ని పార్టీ అధిష్టానాని దృష్టికి తీసుకెళతానన్నారు.

అద్దంకి మున్సిపల్ సమావేశం నేడు

అద్దంకి రూరల్: అద్దంకి పురపాలక సంఘం కౌన్సిల్ సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు చైర్మన్ లక్కెబోయిన ఎస్తేరమ్మ శుక్రవారం తెలిపారు. సమావేశానికి సభ్యులు హాజరు కావాలని కోరారు.

గ్రామ యూనిట్‌గా సర్వే చేయండి


కోలలపూడి కార్యదర్శికి వినతి పత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

మార్టూరు: తమ గ్రామంలో రెవెన్యూ సమస్యలు అధికంగా ఉన్నందున గ్రామాన్ని యూనిట్‌గా భూములు సర్వే చేయడం వలన రైతులపై చలానాల భారం తగ్గేలా చేయాలని కోలలపూడి రైతు సంఘం నాయకులు శుక్రవారం డిమాండ్ చేశారు. అధికారుల తప్పిదాల వలన గ్రామంలో రెవెన్యూ సమస్యలు పెరిగి రైతులు ఎవరికి వారు వ్యక్తిగతంగా తమ భూ సర్వే కోసం చలానాల చెల్లింపు ద్వారా వేలాది రూపాయలు నష్టపోవాల్సి వస్తోందని జిల్లా కౌలు రైతు సంఘం ఉపాధ్యక్షుడు కందిమళ్ల రామకోటేశ్వరావు విచారం వ్యక్తం చేశారు. స్థానిక రైతులతో గ్రామ కార్యదర్శి సుధాకర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కోలలపూడి సర్పంచ్ ఎం. సతీష్ కుమార్, వీరాంజనేయులు, భిక్షాలు, రాంబాబు, శేషయ్య పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ పూర్తి


మాట్లాడుతున్న పీడీ విజయలక్ష్మి

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని 15 గ్రామ పంచాయతీల పరిధిలో ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024వరకు నిర్వహించిన పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. కాగా కొరిశపాడు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ప్రజా వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పీడీ విజయలక్ష్మి పాల్గొన్నారు. మొత్తం 877 పనులు చేయగా వీటికి గాను రూ.6కోట్ల87లక్షలు ఖర్చు చేయగా.. వీటిలో ఎలాంటి అవకతవకలు జరలేదని పీడీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని, గ్రామాల్లో పశువుల కోసం 15 నుంచి 20 వరకు నీటి తొట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీవీఓ శోభన్‌కుమార్, ఎంపీడీఓ రాజ్యలక్ష్మి, పీఆర్ ఏఈ ప్రసాద్, ఏపీఓ కోటేశ్వరి, జెడ్పీటీసీ వెంకటరమణ పాల్గొన్నారు.

అద్దంకి సీఐని అభినందించిన ఎస్పీ


ఎస్పీ నుంచి ప్రశంస పత్రాన్ని అందుకుంటున్న అద్దంకి సీఐ సుబ్బరాజు

అద్దంకి రూరల్: బాపట్ల జిల్లాలో విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన పోలీస్ అధికారులను బాపట్ల ఎస్పీ తుషార్‌డూడి శుక్రవారం పోలీస్ ప్రధాన కార్యాలయంలో అభినందించారు. లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించటంతోపాటు, స్టేషన్ పరిధిలో పలు కేసులను త్వరగా పరిష్కరించినందుకు అద్దంకి సీఐ సుబ్బరాను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి ప్రశంస పత్రాన్ని అందించారు.

అద్దంకి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు


ఎన్నికైన నూతన కార్యవర్గం

అద్దంకి రూరల్: స్థానిక కోర్టు భవనాల సముదాయంలో 2025–26కు గాను బార్ అసోసియేషన్ ఎన్నికలు శుక్రవారం నిర్వహించారు. ప్రెసిడెంట్‌గా వై. శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్‌గా ఎం. ప్రకాష్, సెక్రటరీగా ఎం. గృహలక్ష్మి, జాయింట్ సెక్రటరీగా డి. గంగాధరరావు, ట్రెజరర్‌గా ఎన్. హరిబాబు, లేడీ రిప్రజెంటేటివ్‌గా ఎస్. కుసుమలతను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని న్యాయవాదులు అభినందించారు.

పాస్టర్ ప్రవీణ్ మరణంపై విచారణ చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న పాస్టర్లు

అద్దంకి: పాస్టర్ ప్రవీణ్ మరణంపై అనేక అనుమానాలు వ్యక్తం అయినందున ప్రభుత్వం విచారణ పరిపించాలని కోరుతూ పాస్టర్లు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు అద్దంకి టౌన్, మండల, నియోజక వర్గ పాస్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వివిధ శాఖల అధికారులకు వినతి పత్రాలను అందజేశారు. ఎస్. దయానందం, జీవన్ బుల్లార్డ్, యేసుబాబు, టౌన్ టి. మోహనరావు పాల్గొన్నారు.

ఇళ్ల మధ్యలో ప్రమాదకరంగా బావి


ఇళ్ల మధ్యలో ఉన్న బావి

ఒంగోలు సబర్బన్: నగరంలోని సంతపేటలో పాత అభిలాష్ లాడ్జికి తూర్పువైపున ఇళ్ల మధ్యలో ఉన్న రాణి గారి బావి ప్రమాదకరంగా మారింది. 150 సంవత్సరాల క్రితం ఈ బావిని ఏర్పాటు చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికీ బావిలో పుష్కలంగా నీరుంది. బావికి మూడు వైపులా ఎత్తైన గోడను స్థానికులు ఏర్పాటు చేసుకున్నప్పటికీ ఒకవైపు మాత్రం గోడ ఎత్తు తక్కువగా ఉంది. నివాస ప్రాంతాల మధ్య ఉండటంతో ఆ బావి చుట్టూ పిల్లలు ఆడుకుంటూ ఉంటారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. నగరపాలక సంస్థకు చెందిన ఆ బావిని అధికారులు పూర్తిగా విస్మరించడంతో బావిలోపల గోడల్లో నుంచి చెట్లు మొలిచి పైవరకూ పెరిగాయి. గతంలో ఆ బావిలో దూకి నలుగురు ఆత్మహత్యలు కూడా చేసుకున్నారు. బావిలోని చెట్లు కొట్టేసి మరమ్మతులు చేసి చుట్టూ రక్షణతో పాటు బావిపై ఐరన్ మెష్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఉల్లాసంగా కేఆర్‌కే డిగ్రీ కళాశాల వార్షికోత్సవం



వార్షికోత్సవంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

అద్దంకి రూరల్: అద్దంకిలోని కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల 41వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ వి.మోహన్‌రావు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల వ్యక్తి వికాసానికి దోహద పడతాయన్నారు. విద్యలో ప్రతిభ కనబర్చిన వారికి ఎండోమెంట్ చెక్కులు అందజేశారు. వివిధ సాంస్కృతిక, క్రీడల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు.